క్లుప్తంగా

కాబోయే వధూవరులకు ఎమ్మెల్యే పెళ్లికానుక



పెళ్లి కానుకను అందజేస్తున్న నాయకులు

పాకాల: దామలచెరువులో నూతనంగా పెళ్లి చేసుకోబోతున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. ఆదివారం స్థానిక నాయకుల చేతుల మీదుగా దామలచెరువులోని షాదీమహల్ వీధికి సమీపంలో నివాసం ఉంటూ నూతనంగా పెళ్లి చేసుకుని దంపతులు కాబోతున్న పాళ్యం షబీనా, షేక్ ఇమ్రాన్‌కు బంగారు నల్లపూసల దండ, బట్టలు, స్వీట్స్, వెండి మెట్టెలు, గ్రీటింగ్ కార్డును అందజేశారు. కలకాలం సంతోషంగా ఉండాలని కాబోయే దంపతులను నాయకులు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. తన సొంత నిధులతో ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామలచెరువు ఉపసర్పంచ్ ఎస్ఎ.ఇమ్రాన్, పంచాయతీ కన్వీనర్ గౌస్‌బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రామోత్సవం

భాకరాపేట: అయోధ్య బాల శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని చిన్నగొట్టిగల్లు మండలంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీకోదండ రామాలయ ప్రధాన అర్చకుడు శ్రీరామ కవచం వాసుదేవశర్మ తెలిపారు. ఆదివారం గ్రామాల్లో గ్రామోత్సవంపై చాటింపు వేయించారు. సోమవారం ఉదయం 6 గంటలకు గ్రామోత్సవం జంగావాండ్లపల్లెలో ప్రారంభమై వలసారెడ్డిగారిపల్లె వరకు సాగుతుందన్నారు. అలాగే చిన్నగొట్టిగల్లు దిగువ వీధిలో శ్రీసీతారాములు కల్యాణం, శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు.

నేడు స్పందన

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 9.30–10.30 గంటల మధ్య డయల్ యువర్ కమిషనర్, 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తారు. కమిషనర్ హరితను నేరుగా కలిసి స్పందన ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. డయల్ యువర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాల్సిన నగర వాసులు 0877–2227208 నెంబర్‌కు కాల్ చేయవచ్చు.

భక్తిశ్రద్ధలతో ఓం శక్తి మాలధారణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేటలో వెలసిన గ్రామదేవత గంగమ్మ ఆలయ ఆవరణలో వంద మంది భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఓం శక్తి మాలధారణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, పసుపు, కుంకుమలతో సర్వాంగ సుందరంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుశక్తి అశోక్ ముదిరాజ్ టీం లీడర్ మునిరాజ్ యాదవ్, జనార్దన్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన

తిరుపతి సిటీ: భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో శనివారం నుంచి ప్రారంభమైన పుస్తక ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ నెల 28వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఆదివారం నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇటువంటి పుస్తక ప్రదర్శన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఎక్కువగా విద్యార్థులు, అభ్యర్థులు కొనుగోలు చేశారు.

సంపూర్ణ రామాయణ పారాయణం

తిరుమల: అయోధ్యలో ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో ఉదయం 9 నుండి 12.45 గంటల వరకు సంపూర్ణ రామాయణ పారాయణం చేపట్టనున్నారు. ఈ మేరకు టీటీడీ పీఆర్ఓ విభాగం ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేసింది.

సిపాయి భరోసా అందజేత

ఏర్పేడు: రావిళ్లవారికండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన రాణెమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం సిపాయి భరోసా సాయాన్ని అందజేశారు. రాణెమ్మ(54) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆ గ్రామానికి వెళ్లి తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

శతమానంభవతి

- 125 ఏళ్లుగా చరిత్ర కలిగిన టవర్ క్లాక్
- రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- భూమన అభినయ్‌రెడ్డి చొరవతో పూర్వవైభవం

తిరుపతి తుడా: అలనాడు గ్రామంగా ఉన్న తిరుపతిలోని కొన్ని ప్రాంతాల హద్దులను తెలిపేలా, యాత్రికుల సౌకర్యార్థం.. 125 ఏళ్ల క్రితం టవర్ క్లాక్‌లను ఏర్పాటు చేశారు. ఈ టవర్ క్లాక్‌లు దశాబ్దాలుగా నగర వాసులు, యాత్రికులకు కాలమానాన్ని గుర్తుచేసేవి. ఏళ్ల తరబడి నిరంతరం పనిచేస్తూ కాల క్రమేణా అలసిపోయాయి. గడిచిన రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎట్టకేలకు తిరుపతి వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త, నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి చొరవతో ఓ టవర్ క్లాక్‌కు పూర్వ వైభవం వచ్చింది. టవర్ క్లాక్‌ను పునరుద్ధరించడంతో చరిత్రకు సాక్ష్యంగా నిలవడంతోపాటు నాటి గుర్తులను నెమరు వేసుకునేలా చేసింది.

యాత్రికుల కోసమే..

తిరుమలకు వెళ్లే భక్తులు తిరుపతి మీదుగా తమ ప్రయాణం సాగిస్తారు. శతాబ్దం క్రితం కాలినడకన, ఎడ్లబండ్లు, వివిధ వాహనాలు, రైలు మార్గం మీదుగా వచ్చే యాత్రికులకు రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకునేవారు. అక్కడి నుంచి గాంధీ రోడ్డు, పూలమఠం, చిన్నబజారు వీధి, చెన్నారెడ్డికాలనీ మీదుగా అలిపిరికి చేరుకునేవారు. యాత్రికులకు దారి మార్గాన్ని తెలియజెప్పడంతోపాటు సమయాన్ని తెలిపేందుకు కొన్ని ప్రాంతాల్లో శతాబ్దాల క్రితం టవర్ క్లాక్‌లను నిర్మించారు. గాంధీరోడ్డులో హాథీరాంజీ మఠం– పూల మార్కెట్, చిన్నబజారు వీధి చివరిన(ప్రభుత్వ బాలిక పాఠశాల కూడలి), తీర్థకట్టవీధి నుంచి రాములవారి గుడికి వెళ్లే మార్గం కూడలివద్ద నాడు టవర్ క్లాక్‌లను ఏర్పాటు చేశారు.

శభాష్ అభినయ్‌రెడ్డి

నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి సమూల అభివృద్ధే తన ప్రధాన అజెండాగా పక్కా ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు. తిరుపతి ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా మరో 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఇంటర్నల్ రోడ్ల, మౌలిక వసతులను ఊహించని స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి చరిత్రలను చాటి చెప్పిన అనే ఆనవాళ్లు కనుమరుగు అవుతున్నాయి. కలియుగ వైకుంఠనాథుని పరమభక్తుడైన శ్రీకృష్ణదేవరాయలు చెన్నారెడ్డి కాలనీలో యాత్రికుల తాగునీటి, పుణ్య స్నానాలు సౌకర్యార్థం కృష్ణమనాయుని కుంటను తవ్వించారు. కాలక్రమేణా ఆ కుంట కనుమరుగై శిథిలావస్థకు చేరింది. ఈ చారిత్రక కుంటను కోట్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారు. అలాగే నగర చరిత్రకు మచ్చుతునక అయిన టవర్ క్లాక్‌లకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నగర డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నడుం బిగించారు. ఓ పక్క నగరానికి ఆధునిక మౌలిక వసతుల కల్పనతో పాటు చారిత్రక ఆనవాళ్లకు పూర్వ వైభవం తీసుకొచ్చే పనిలో ఉన్నారు.



ముస్తాబైన గాంధీరోడ్డు హాథీరాంజీ మఠం ముందు ఉన్న టవర్ క్లాక్

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి

తిరుపతి రూరల్: శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం సీగాల్లపల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అల్లోపతి, ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి ప్రారంభించారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాలకు చెందిన డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ కావ్య, డాక్టర్ హరిత, డాక్టర్ కార్తిక్, డాక్టర్ ప్రభాత్ ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు రెడ్డిశేఖర్, సరళ, వాణి, గణేష్, లీలావతి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వానికి దర్పణం 'మట్టి అద్దం'



మట్టి అద్దం కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: సమకాలీన సామాజిక అంశాలు, తెలుగు భాష, సంస్కృతి, విద్య, ప్రకృతి, పర్యావరణం, కుటుంబ బంధాలు, మానవీ విలువల పతనంపై ప్రశ్నించే తత్వమే యువశ్రీ మురళీ మట్టి అద్దం కవితా సంపుటి పుస్తకమని ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ అధిపతి రాజేశ్వరమ్మ తెలిపారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యాయ సంఘ నేత యువశ్రీ మురళి కవితా సంపుటి మట్టిఅద్దం పుస్తకావిష్కరణ సభ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేశ్వరమ్మ, శ్వేత భవన్ పూర్వ సంచాలకుడు భూమన్ పాల్గొని, మట్టి అద్దం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భూమన్ మాట్లాడుతూ పల్లెటూరి మట్టి వాసనలకు మట్టి అద్దం కవితలు దర్పణం పడుతాయన్నారు. పుస్తక సమీక్షకుడు, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి, గంటా మోహన్, శతావధాని ఆముదాల మురళి, సాహితీవేత్తలు, రచయితలు తమటం రామచంద్రారెడ్డి, గుండుపల్లి గోవిందయ్య, కలువకుంట రామమూర్తి, తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, ఏడు కొండలు, మల్లారపు నాగార్జున, నడ్డి నారాయణ, పురుషోత్తమాచారి, మునిమోహన్ సిద్దారెడ్డి, దేవరాజులురెడ్డి, కన్నయ్య, అంకమనాయుడు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

- ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తిరుపతి కల్చరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ బీసీలకు సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నా బీసీ జాతి కోసం పని చేస్తూ వారి అభ్యున్నతికి దోహదపడాలన్నారు. తిరుపతి జిల్లాలో బీసీలకు రెండు సీట్లు కేటాయించి జిల్లాలో బీసీల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా రాజకీయ పార్టీలు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు నాగరాజ గౌడ్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, ఉపాధ్యక్షుడు మధు మార్గాచారి, తులసి, కిరణ్ గౌడ్, కుమార్ గౌడ్, దినేష్ పాల్గొన్నారు.

4న తిరుపతిలో బీసీల బహిరంగ సభ



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు

తిరుపతి కల్చరల్: బీసీల ఆత్మగౌరవం కోసం, బీసీ యువత భవిష్యత్తు లక్ష్యంగా ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర ఫిబ్రవరి 4న తిరుపతిలో ముగియనున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అణచివేతకు గురవుతున్న బీసీలకు బాసటగా బీసీ అట్రాసిటీ యాక్టును, ప్రైవేటు రంగంలో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ల డిమాండ్‌తో తిరుపతిలో భారీ బహిరంగ సభ చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నూకానమ్మ, నాయకులు తురక అమరనాథ్, జగన్నాథం, ప్రసన్నకుమార్, లక్ష్మణరావు, నారాయణస్వామి, దేవి పాల్గొన్నారు.

వారపు సంతలో భోజన వసతి



అన్నదానం చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

చంద్రగిరి: వారపు సంతలో వ్యాపారాలు చేసుకునే రైతన్నలకు, వ్యాపారస్తులకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 నుంచి 4 గంటల వరకు సుమారు వెయ్యి మందికి అన్నదానం చేసినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుమారు ఆరు నెలలుగా ప్రతి ఆదివారం సంతలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ దూర ప్రాంతాల నుంచి వ్యాపారాలు చేసుకునే వర్తకులు, రైతులకు మధ్యాహ్నం ఆకలితో పస్తులుండకూడదనే ఉద్దేశంతో తమ నాయకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, నాయకులు వెంకటయ్య, సిద్దిక్ బాషా, మదన్, ప్రవీణ్, భాను ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం చెన్నై శంకర నేత్రాలయం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 124 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 26 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని సోమవారం మధ్యాహ్నం చెన్నై శంకర నేత్రాలయానికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేసి తిరిగి బుధవారం తీసుకొస్తారని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు వైద్య శిబిరంలో సేవలు అందించారు. వీరికి లయన్స్‌క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయ్‌బాబు, జీఎంటీ మెంబర్ ఆర్‌వి.ప్రసాద్, కుప్పుస్వామినాయుడు, దొరస్వామినాయుడు, తులసీరామన్, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం



మెడల్ అందజేస్తున్న ఆర్‌కే రెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్: ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా అబాకస్ శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులను ఆర్‌కే అబాకస్ చైర్మన్, డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే రెడ్డి విమల ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కే రెడ్డి విమల మాట్లాడుతూ స్థానిక ఎం.ఆర్.పల్లి కూడలిలోని ఆర్.కె.అబాకస్ శిక్షణా కేంద్రం నందు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు 13 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తూ ఎంతో మందికి ఉజ్వల భవిష్యత్తు అందిస్తున్నామని తెలిపారు. అబాకస్‌లో ప్రావీణ్యం చూపిన హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి అద్విక్ 3వ విభాగంలో ప్రథమ బహుమతి పొందారన్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆర్.కె.విమల, అధ్యాపక బృందం బి.ప్రతాప్‌రెడ్డి అభినందనలు తెలిపారు. సైనిక, రక్షణ రంగంలో, వార్తా పత్రికలు, పోలీస్ రంగాలలో పనిచేసే ఉద్యోగుల పేద విద్యార్థినీవిద్యార్థులకు రాయితీతోపాటు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు చక్కటి అబాకస్ శిక్షణ కోసం 9989500074, 7386502450 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఐఎన్‌టీయూసీ వర్కింగ్ జనరల్ సెక్రటరీగా మురళీధర్



మురళీధర్‌కు నియామక పత్రం అందిస్తున్న మోహన్‌రెడ్డి, రత్నకుమార్

తిరుపతి రూరల్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ జనరల్ సెక్రటరీగా ఆర్.మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐఎన్‌టీయూసీ మూడు జిల్లాల అధ్యక్షుడు లేబూరి రత్నకుమార్ అధ్యక్షతన ఆదివారం తిరుపతిలోని యూత్ హాస్టల్లో మూడు జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులపై అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, కార్మికుల సమస్యల పరిష్కారంపై విస్తృత చర్చ నిర్వహించారు. మండలస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయిలో యూనియన్ బలోపేతం చేయాలని తీర్మానం చేశారు. అనంతరం నూతన వర్కింగ్ జనరల్ సెక్రటరీగా ఎస్పీడీసీఎల్ లో పనిచేస్తున్న కార్మిక సంఘ నాయకుడు మురళీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు రత్నకుమార్ చేతుల మీదుగా మురళీధర్‌కు అందజేశారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు షఫీ ఉల్లా, మురళి, నౌహీరా, అనూష, రంజిత్, రాజేష్, సభ్యులు పాల్గొన్నారు.